హాకర్ జోన్లు ఏవీ?

- ప్రధాన రహదారులు, కూడళ్లు, ఫుట్‌పాత్‌లపై ఏర్పాటైన తోపుడు బళ్లు
- ఈ కారణంగా తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలు
- అధికారుల దాడులతో ఉపాధి కోల్పోతున్నామని వ్యాపారుల ఆవేదన
- సుప్రీం కోర్టు ఆదేశాలు సైతం అమలు కావడం లేదంటున్న హాకర్స్
- అన్ని ప్రాంతాల్లో జోన్లు ఏర్పాటు చేసి, ఉపాధికి భరోసా కల్పించాలని విజ్ఞప్తి



నరసింహనగర్ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన తోపుడు బళ్లు



రోడ్డు పక్కన పండ్లు, సామగ్రి విక్రయిస్తున్న వ్యాపారులు

వీధి విక్రయదారుల సంక్షేమ చట్ట ప్రకారం..

తోపుడు బళ్ల వ్యాపారుల సంక్షేమం కోసం సుప్రీం కోర్టు ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వం 2014లో వీధి విక్రయ వ్యాపారుల చట్టం చేసింది. దాని ప్రకారం ఫుట్‌పాత్‌పై, రహదారుల వెంబడి తోపుడుబళ్ల వ్యాపారులను గుర్తించి, హాకర్ జోన్లు నిర్మించాలని, వారికి సమస్య ఏర్పడితే ప్రత్యామ్నాయం చూపించి ఉపాధికి భరోసా కల్పించాలని పేర్కొంది. ఈ చట్ట ప్రకారం ఒడిశా, ఢిల్లీ, ముంబై రాష్ట్రాల్లో, తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో హాకర్ జోన్లు ఏర్పాటు చేశారు. మన రాష్ట్రంలో మాత్రం ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేయ లేదనే చెప్పాలి.



హాకర్ జోన్లు ఏర్పాటు చేయాలని ధర్నా చేస్తున్న తోపుడు బళ్ల వ్యాపారులు(ఫైల్)

సీతంపేట: చదువు లేదనో.. చదివినా ఉద్యోగం రాలేదనో.. పొట్ట చేత పట్టుకుని బతుకుదెరువు కోసం వలస వచ్చిన వారు స్వయం ఉపాధి బాట పడుతున్నారు. ఇలా వీరంతా రోడ్డు పక్కన ప్రధాన కూడళ్లలో, ఫుట్‌పాత్‌లపై తోపుడు బండి పెట్టుకుని కూరగాయలు, చిరుతిళ్లు, పూలు, పండ్లు, టిఫిన్లు, ఫాస్ట్‌ఫుడ్స్, కర్రీలు, టీ, చెరుకు రసం, కొబ్బరి బొండాలు, ఇతర శీతల పానీయాలు విక్రయిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. సీతమ్మధార, రామాటాకీస్, సీతంపేట, అక్కయ్యపాలెం, దొండపర్తి, 80 అడుగుల రోడ్డు, నరసింహనగర్, రైల్వే న్యూకాలనీ, తాటిచెట్లపాలెం, కప్పరాడ, కంచరపాలెం, కైలాసపురం, మర్రిపాలెం తదితర ప్రాంతాల్లో వందలాది మంది తోపుడు బళ్లు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు.

రోడ్డు పక్కన, ఫుట్‌పాత్‌పై, ప్రధాన కూడళ్లలో తోపుడు బండి పెట్టి వ్యాపారాలు చేస్తుండటంతో వీరి వద్దకు సరకులు కొనడానికి వచ్చిన వారు తమ వాహనాలను రోడ్డుపైన అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంతో కొన్ని సందర్భాల్లో వాహనాల రాకపోకలకు, పాదచారులు నడవడానికి ఆటంకాలు ఏర్పడి ట్రాఫిక్ సమస్యలు, కొన్ని సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇవి జరిగినపుడు ఇటు పోలీస్ విభాగం.. అటు జీవీఎంసీ విభాగం తోపుడు బళ్లు తొలగించడంతో వారి ఉపాధికి ఇబ్బంది కలుగుతోంది. తోపుడు బళ్ల కారణంగా రహదారులు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించారని, వీరి కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, ఫుట్‌పాత్‌లపై నడవడానికి వీలు లేకుండా పోయిందని ప్రజల నుంచి తరచూ ఇటు జీవీఎంసీకి.. అటు ట్రాఫిక్ పోలీస్ విభాగానికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి తోపుడు బళ్లు తొలగిస్తున్నారు. ఈ సందర్భాల్లో తోపుడుబళ్ల వ్యాపారులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది నుంచి దాడులు, కేసులు, జరిమానాలు లేకుండా తమ వ్యాపారాలకు ఒక చోటు చూపించి హాకర్ జోన్లు ఏర్పాటు చేయాలని తోపుడుబళ్ల వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

గుర్తింపు కార్డులతో సరి..

వీధి విక్రయదారుల చట్టం ప్రకారం 2014లో మెప్మా ద్వారా జీవీఎంసీ పరిధిలోని వీధి విక్రయదారులకు ఐదేళ్ల కాల పరిమితితో గుర్తింపు కార్డులు జారీ చేశారు. హాకర్ జోన్లు మాత్రం ఏర్పాటు కాలేదు. ఉత్తర నియోజకవర్గంలో 3,500 నుంచి 3,800 వరకు తోపుడు బళ్ల వ్యాపారులు ఉన్నట్టు తెలుస్తోంది. హాకర్ జోన్లు లేక వీరంతా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇది జరిగి ఏళ్లు గడుస్తున్నా హాకర్ జోన్లు ఏర్పాటు కాక దినదిన గండం అన్నట్టు కాలం వెళ్లదీస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో హాకర్ జోన్లు ఏర్పాటు చేసి తమకు రక్షణ కల్పించాలని తోపుడు బండ్ల వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు చొరవ చూపితే ట్రాఫిక్ సమస్యలు పరిష్కారవుతాయని చెబుతున్నారు.

పెట్టీ కేసులతో జరిమానాలు



కార్పొరేట్ సంస్థలు, మాల్స్ వచ్చాక వీధి వ్యాపారాలు 30 నుంచి 40 శాతం తగ్గిపోయాయి. వీధి వ్యాపారులు అమ్మే వస్తువుల విక్రయాలు మాల్స్, కార్పొరేట్ సంస్థల్లో నిషేధించాలి. ట్రేడ్ లైసెన్స్‌లు కడుతున్నా.. ట్రాఫిక్ పోలీసులు పెట్టీ కేసులు పెట్టి జరిమానాలు విధిస్తున్నారు. మరో పక్క ఆశీలు డిమాండ్ చేస్తున్నారు.
– పి.సాయికుమార్, అరటిపళ్ల వ్యాపారి

హాకర్ జోన్లు ఏర్పాటు చేయాలి



వీధి విక్రయదారుల చట్టం ప్రకారం వెండర్స్‌కు ఫొటో గుర్తింపు కార్డులివ్వాలి. ఎక్కడికక్కడ హాకర్ జోన్లు ఏర్పాటు చేయాలి. వ్యాపారానికి హామీ లేని ముద్రా బ్యాంకు రుణాలు, ప్రభుత్వం పేదలకు నిర్మించే ఇళ్లల్లో 2 శాతం తోపుడుబళ్ల వ్యాపారులకు మంజూరు చేయాలి. పోలీసులు, జీవీఎంసీ నుంచి కేసులు, జరిమానాలు, ఆశీలు వసూళ్ల లేకుండా చర్యలు చేపట్టాలి.
– జి.వామనమూర్తి, ప్రధాన కార్యదర్శి, విశాఖ ఫుట్‌పాత్ అండ్ తోపుడుబళ్ల సంక్షేమ సంఘం

బతుకు దినదిన గండం



పాతికేళ్లుగా తోపుడు బండిపై పండ్లు విక్రయిస్తున్నాను. గతంలో ఒకసారి గుర్తింపు కార్డులిచ్చారు. మళ్లీ రెన్యువల్ చేయలేదు. హాకర్ జోన్ల ఏర్పాటు లేదు. తరచూ ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నారు. మా వ్యాపారానికి రక్షణ లేకుండా పోయింది. బతుకు దినదిన గండంగా ఉంది. – పి.సంతోష్, పండ్ల వ్యాపారి, నరసింహనగర్

ఉపాధికి భరోసా కల్పించాలి



అనారోగ్యం వచ్చినా, వర్షం పడినా వ్యాపారం బంద్. ఆ రోజుల్లో ఆదాయం ఉండదు. పిల్లల చదువులు, ఇంటి అద్దె, ఆస్పత్రి ఖర్చులు భారంగా మారాయి. పేదలకు ఇచ్చే ఇళ్లల్లో రెండు శాతం వెండర్లకు కేటాయిస్తే బాగుంటుంది. వెండర్స్ ఉపాధికి భరోసా కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.
– బి.కృష్ణవేణి, టిఫిన్ బండి, నరసింహనగర్

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



రెయ్యి వెంకటరమణను సత్కరించి అభినందిస్తున్న బొత్స సత్యనారాయణ

మర్రిపాలెం: రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను సోమవారం 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితుడైన సందర్భంగా రెయ్యి వెంకటరమణను బొత్స శాలువాతో సత్కరించి అభినందించారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, జీవీఎంసీ ఫ్లోర్ లీడ్ బాణాల శ్రీనివాసరావు, బల్ల లక్ష్మణరావు, కేవీఎస్ శశికళ, చెన్నా జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు కిట్ల పంపిణీ



కొబ్బరినూనె అందిస్తున్న సుధాకర్, చిరంజీవి

మర్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులో పారిశుధ్య కార్మికులకు సోమవారం కిట్లు పంపిణీ చేశారు. శానిటరీ కార్యాలయంలో 40 మంది సిబ్బందికి నాలుగు లీటర్లు కొబ్బరినూనె, 12 సబ్బుల చొప్పున వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సూపర్‌వైజర్ చిరంజీవి అందజేశారు. వార్డును మరింత పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులు చురుగ్గా పనిచేయాలని సుధాకర్ సూచించారు.

నూకాంబిక ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న గ్రామ కమిటీ సభ్యులు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు అరుంధతి నగర్ నూకాంబిక ఆలయంలో మహోత్సవ గ్రామ కమిటీ, ఆలయ వ్యవస్థాపకుడు కోరిబిల్లి విజయ్ సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారి పాదాలు, నూతన గోపురం పునర్నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ముఖ్య అతిథి మానేపల్లి సుగుణ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కోరిబిల్లి రమణ, అప్పన్నదొర, గోవింద్, మాడం లక్ష్మణరావు ఎర్రయ్య, కోరిబిల్లి చిన్నారావు, చంటి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అలరించిన స్వరమంజరి



పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

సీతంపేట: అపర్ణ మెలోడీస్ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన స్వరమంజరి మధుర గీతాల కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. సంస్థ గాయనీ గాయకులు పాత సినిమాల్లోని హిట్ సాంగ్స్ ఆలపించి ఉర్రూతలూగించారు. సత్యానందం, వి.వి.చారి, గంటి ఉష, శ్రీదేవి, రుద్రవేణి, మెరాజ్, కేశవరావు, కె.లక్ష్మణరావు సినీ గీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు.

25న జేసీఐ సదస్సు

అల్లిపురం: జేసీఐ ఆధ్వర్యంలో 14 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు వారికి లక్ష్య సాధనలో మెళకువలపై దిశానిర్దేశం చేసేలా జేసీఐ ప్రత్యేక సదస్సు చైతన్యం–2025ను నిర్వహించనున్నట్లు జోన్4 వైస్ ప్రెసిడెంట్ చైతన్య, వైజాగ్ అచీవర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ సోమశేఖర్, చైతన్యం కాన్ఫరెన్స్ డైరెక్టర్ డా.శీతల్ తెలిపారు. ఈ నెల 25న సాయిప్రియ రిసార్ట్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు జరిగే ఈ కార్యక్రమ వివరాలను డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. దశాబ్ది కాలానికి పైగా జేసీఐ సామాజిక బాధ్యతతో వ్యక్తిత్వ, సంస్థాగత అభివృద్ధితోపాటు వ్యాపార విస్తరణ అవకాశాలపై విస్తృతస్థాయి సదస్సుల ద్వారా యువతకు అండగా నిలుస్తోందన్నారు. దీంతోపాటు జేసీఐ జోన్ 4 రీజియన్, సభ్యుల విజయాలు, లక్ష్యాలు తదితర అంశాలపై చర్చిస్తామన్నారు.

రైల్వేస్టేషన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోరా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) లలిత్ బోరా సోమవారం విశాఖ రైల్వేస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రయాణికుల సౌకర్యాలు, స్టేషన్ పరిశుభ్రత, కోచ్‌ల నిర్వహణ, ప్రయాణికుల రద్దీ వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డీఆర్‌ఎం ప్రయాణికులు వేచి ఉండే ప్రదేశాలు, సాధారణ టికెట్ బుకింగ్ కౌంటర్లు, పాదచారుల వంతెనలు, ఎస్కలేటర్లు, లిఫ్టులు, ప్లాట్‌ఫారాలు, పార్కింగ్ సదుపాయాలు, బెడ్‌రోల్ నిర్వహణ, క్యాటరింగ్ స్టాల్స్‌తో పాటు 'ఒక స్టేషన్ – ఒక ఉత్పత్తి' స్టాల్‌ను సందర్శించారు. ఆయన ఆయా స్టాల్స్‌లోని విక్రయదారులతో ముఖాముఖి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ తనిఖీలో డీఆర్‌ఎంతో పాటు ఏడీఆర్‌ఎం (ఇన్‌ఫ్రా) ఇ. శాంతారాం, కమర్షియల్, ఇంజినీరింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఆపరేషన్స్, సెక్యూరిటీ, సిగ్నల్ అండ్ టెలికాం విభాగాల అధికారులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి స్థలం హామీ నెరవేర్చాలని డిమాండ్



సీతమ్మధార తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

తాటిచెట్లపాలెం: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన రెండు సెంట్లు, మూడు సెంట్ల స్థలం, ఇంటి ఖర్చుకు రూ.5 లక్షలు ప్రతి లబ్ధిదారుడికి వెంటనే ఇవ్వాలని సీపీఐ డిమాండ్ చేసింది. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి, మేనిఫెస్టోలో కూడా పెట్టారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా సీఎం చంద్రబాబు ఈ అంశాన్ని ప్రస్తావించకపోవడం దుర్మార్గమన్నారు. అనంతరం తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నెయ్యల నాగభూషణరావు, జిల్లా సమితి సభ్యుడు పడాల గోవింద్, సీనియర్ నాయకులు ఆడారు ఆదినారాయణ, ఎస్.మధురెడ్డి, చంటి, హరి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భారత సైనికులకు జేజేలు



తిరంగా యాత్ర చేస్తున్న వనితా వాకర్స్ క్లబ్ మహిళలు

మురళీనగర్: ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన భారత త్రివిధ దళాలకు జేజేలు పలుకుతూ మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు సోమవారం వైశాఖి స్పోర్ట్స్ పార్కులో తిరంగా యాత్ర నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొని జవాన్లకు తమ మద్దతు ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్‌లో వీర మరణం పొందిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. జాతీయ జెండాలను చేతపట్టి యాత్ర సాగించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షురాలు వి.జయప్రభాశర్మ, కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి కె.భానుమతి, సంయుక్త కార్యదర్శి జి.శిరీషలత, సంయుక్త కోశాధికారి ఎం.ప్రమీల రావు, సీనియర్ సభ్యులు ఆర్.స్నేహలత, జి.మంగాదేవి, జి.షీలారాణి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రౌడీమూకల దాడిపై కేసు



బీరు బాటిల్స్ విసురుతున్న రౌడీ మూకలు

ఎంవీపీకాలనీ: లాసన్స్ బే కాలనీ శాంతి ఆశ్రమం భూముల్లో రౌడీ మూకల దాడికి సంబంధించిన వీడియో వైరల్ అయింది. కొన్నేళ్లుగా అక్రమంగా వినియోగించుకుంటున్న కొందరు గత నెలలో ఆ భూములను శాంతి ఆశ్రమానికి అప్పగించారు. సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత ఆశ్రమం యాజమాన్యం భూమిని దక్కించుకున్నప్పటికీ, ఆక్రమణదారుల ఆగడాలు కొనసాగుతున్నాయి. ఇటీవల ఆ భూముల్లో పనిచేస్తున్న ఆశ్రమానికి చెందిన వారిపై ఆక్రమణదారుడు సిద్ధార్థ్ పంపిన రౌడీ మూకలు రాళ్లు, బీర్ బాటిళ్లతో దాడి చేశారు. జాలరిపేట శ్మశానవాటిక రోడ్డు వైపు నుంచి ఆశ్రమానికి అప్పగించిన భూముల్లో పనులు చేస్తున్న వారిపై దాడి చేస్తున్న వీడియో వైరల్ అయింది. ఈ ఘటనపై ఆశ్రమం ప్రతినిధులు ఈ నెల 15న ఫిర్యాదు చేయగా, ఎంవీపీ పోలీసులు సిద్ధార్థ్‌తో పాటు రౌడీ మూకలపై కేసు నమోదు చేశారు. వీడియోలో ఉన్నవారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. సోమవారం విద్యార్థులచే కథలు చదివించి, చెప్పించారు. భారతీయ కళలపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా నృత్య పోటీ ఏర్పాటు చేశారు. లైబ్రేరియన్ వై.పద్మజ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. విశ్రాంత ఉద్యోగి కె.వి.రమణారెడ్డి విద్యార్థులను ప్రోత్సహించారు.

మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్‌గా పద్మజ



తమ్మినేని పద్మజ

మర్రిపాలెం: విశాఖ జిల్లా మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్‌గా తమ్మినేని పద్మజ నియమితులయ్యారు. గతంలో బీజేపీ 51వ వార్డు అధ్యక్షురాలిగా ఆమె పనిచేశారు. ప్రస్తుతం విశాఖ జిల్లా పార్టీ పార్లమెంట్ సెక్రటరీగా ఉన్నారు. తనను డైరెక్టర్‌గా నియమించిన ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ నాయకులకు సోమవారం పద్మజ కృతజ్ఞతలు తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు



డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్త రోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు.

సుందరయ్య స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కండి

అల్లిపురం: కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత, తొలి ప్రధాన కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని జగదాంబ సిటు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు తపన్ సేన్, సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు తదితరులు పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. దేశంలో భూ పంపిణీ జరగాలని, దున్నే వారికే భూమి నినాదంతో తెలంగాణా సాయుధ పోరాటం జరిపిన వ్యక్తి అని పేర్కొన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా నిరంతరం పేదల పక్షాన పోరాడారని తెలిపారు. పార్లమెంటులో తొలి ప్రతిపక్ష నేతగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అందరికీ విద్య, వైద్యం, తినడానికి తిండి, ఉండడానికి ఇల్లు, చేయడానికి పని కల్పించేలా ప్రభుత్వంపై పోరాడాలన్నారు. సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, పి.మణి, ఎం.సుబ్బారావు, కుమార మంగళం, పి.రాజు, పోలేశ్వరావు, సూరీడు, పి.వెంకటరావు, చంద్రమౌళి, శేఖర్, శివ, గణేష్, రమణ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి నాలుగు వినతులు అందినట్లు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్‌కు 02, పబ్లిక్ హెల్త్‌కు 01, మంచినీటి విభాగానికి 01 చొప్పున అర్జీదారులు వినతిపత్రాలు అందజేసినట్లు చెప్పారు. ప్రజా ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, విద్యుత్ దీపాల ఏఈ అర్చన, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి, టీపీవో ప్రవీణ్, సర్వేయర్ లీలావతి, మంచినీటి విభాగం డీఈ సతీష్, ఏఈ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్‌లో ప్రత్యేక కార్యక్రమాలు



మాట్లాడుతున్న సనపల భానుప్రకాష్

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో సభ్యత్వ నమోదుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ తెలిపారు. సోమవారం నిర్వహించిన క్లబ్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్లబ్‌లో శాశ్వత సభ్యులుగా చేరడానికి గతంలో ఉన్న రూ.5 వేలకు బదులుగా రూ.3 వేలు రుసుమును నిర్ణయించామన్నారు. సేవా కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన ప్రణాళికను వెల్లడించారు. ఈ నెల 25న వీ–డెంటల్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం, త్వరలో ఉమాపతి మాస్టర్ ఆధ్వర్యంలో చదరంగంపై ఉచిత శిక్షణ, జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం, 7న క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు భానుప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి నానుపాత్రుని ప్రకాశరావు, డైరెక్టర్ పైడి గిరిధర్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

జైల్‌లో పటిష్ట రక్షణ చర్యలు



జైల్ సూపరింటెండెంట్ మహేష్‌బాబు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. ఖైదీల కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాల సంఖ్యను పెంచుతున్నట్లు జైలు సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు తెలిపారు. గతంలో 9 సీసీ కెమెరాలు ఉండగా, ప్రస్తుతం అదనంగా 32 కెమెరాలు ఏర్పాటు చేయడంతో 41 కెమెరాలు పనిచేస్తున్నాయి. జైలు విస్తీర్ణం దృష్ట్యా మరో 300 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న కెమెరాల పుటేజీలను నిరంతరం పరిశీలిస్తూ ఖైదీల ప్రవర్తనను గమనిస్తున్నామని, ఇటీవల ఒక ఖైదీ షేవింగ్ కిట్ దాచడం సీసీ కెమెరాల ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. జైలులో పూర్తిస్థాయి రక్షణ చర్యలు ఏర్పాటు చేస్తామని సూపరింటెండెంట్ పేర్కొన్నారు.